క్లుప్తంగా

జిల్లా ప్రజలకు ఎస్పీ దసరా శుభాకాంక్షలు

కోనేరు సెంటర్: కృష్ణాజిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ వి.వి ద్యాసాగర్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని.. ప్రజలు చేపట్టిన కార్యాలు సఫలీకృతం కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వరద బాధితులకు తక్షణ సాయం అందించాలి



కె.కొత్తపాలెం(మోపిదేవి): వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు తక్షణం అందజేసి వారిని ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కె.కొత్తపాలెం ఎస్సీ కాలనీ వరద బాధితులను ఆయన బుధవారం పరామర్శించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం



చల్లపల్లి: మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామానికి చెందిన దాసి నాగేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చెన్ను రంగారావు, అతని స్నేహితుడు ఏలూరు శ్యామ్‌మోహన్‌లు బుధవారం నాగేశ్వరరావుకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వక్కలగడ్డ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఆలూరి బాబూరావు, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మద్దాల వీరాస్వామి, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ పఠాన్ కరీముల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమలపై విచారణ

ఘంటసాల: మండలంలోని కొడాలి గ్రామం శ్రీ శివకేశ్వర స్వామి దేవస్థానం భూములు, ఆస్తులు ఆక్రమణలకు గురైనట్లు గ్రామానికి చెందిన తుమ్మల సుబ్రహ్మణ్యేశ్వరరావు గతంలో ఘంటసాల తహసీల్దార్‌కు అర్జీ సమర్పించారు. దీనిపై విజయవాడ గొల్లపూడి దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ స్పందించడంతో కాకినాడకు చెందిన దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, కృష్ణాజిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు, మచిలీపట్నం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో బుధవారం జలధీశ్వర దేవాలయంలో విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఘంటసాల, చల్లపల్లి దేవస్థానాల ఈవోలు యార్లగడ్డ వాసు, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.







చల్లపల్లిలో కన్యకా పరమేశ్వరీ | కృత్తివెన్నులోని అడ్డపర్రలో అమ్మవారు | బంటుమిల్లి వేంకటేశ్వరుని ఆలయంలో.. | విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ | మహిషాసురమర్దినిగా గణపేశ్వరం దుర్గమ్మ

పాహిమాం అసుర సంహారిని

మహర్నవమిని పురష్కరించుకుని జగన్మాతను బుధవారం మహిషాసురమర్దినిగా అలంకరించారు. జగజ్జననీ.. జగదాంబికా అయిన లోకనాయకి త్రిశూలంతో మహిషురిడిని అంతమొందిస్తూ సింహ వాహనంపై ఉగ్రరూపంతో దర్శనమిచ్చారు. అసుర సంహారిని అయిన దుర్గమ్మను చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విశేష కుంకుమ పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ ఆటలు ఆద్యంతం అలరించాయి. పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి 'జయ జయహే మహిషాసురమర్దిని' అంటూ అమ్మముందు ప్రణమిల్లారు. గురువారం దసరా వేడుకలను నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. – సాక్షి నెట్‌వర్క్



గూడూరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆజాద్ రోడ్‌లోని కన్యకా పరమేశ్వరీ



కన్యకా పరమేశ్వరీ సన్నిధిలో బతుకమ్మలతో మహిళలు



పెడనలో సామూహిక కుంకుమ పూజలు

నాలుగో రోజు ముంపులోనే పంటలు



నీట మునిగిన వెలివోలు కరకట్ట దిగువున పంట



రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద వరద

చల్లపల్లి: కృష్ణానది వరద కారణంగా కరకట్ట దిగువన గల పంట పొలాలు గత నాలుగు రోజులుగా ముంపులోనే నానుతున్నాయి. మండల పరిధిలోని నడకుదురు, వెలివోలు, నిమ్మగడ్డ, రాముడుపాలెం ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలకుపైగా కరకట్ట దిగువన ఉన్న వాణిజ్య, కూరగాయల పంటలు ముంపు నీటిలోనే మగ్గుతున్నాయి. వరద తగ్గిన తరువాత ఎంత వరకూ పంటలు నిలదొక్కుకుంటాయోనని ఆయా ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

చల్లపల్లి: చల్లపల్లి మండలం రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద వరద కొనసాగుతూనే ఉంది. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి అని స్థానికులు బుధవారం తెలిపారు.

గూడూరు ఎంపీడీవోగా శైలజ కుమారి



గూడూరు: గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పి.శైలజ కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో కన్నమ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆమె గూడూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. శైలజ కుమారి బంటుమిల్లి ఈవోపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంపీడీవోగా గూడూరు వచ్చారు. ఇప్పటి వరకూ గూడూరు ఎంపీడీవోగా ఉన్న టి.అనూహ్య దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో మండల పరిషత్ ఏవో కె.వి.రామకృష్ణ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు.

బాధితులకు పేర్ని కిట్టు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న కిట్టు

మచిలీపట్నం టౌన్: నగరంలోని పలు డివిజన్‌లలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) బుధవారం పరామర్శించారు. 28వ డివిజన్‌లో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మహమ్మద్ హాజీ, ఇటీవల తండ్రిని కోల్పోయిన అరుణ్ కుమార్‌లను కిట్టు పరామర్శించారు. కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అచ్చెబా, పార్టీ నగర ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ సాహెబ్, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రంగంలో తగ్గిన జీఎస్టీ



జీఎస్టీ వివరాల కరపత్రాలను చూపుతున్న నారాయణరావు, కాగిత తదితరులు

పెడన: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి ప్రజలకు, రైతులకు మేలు చేసిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. పెనుమల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు జీఎస్టీపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, వాణిజ్యపన్నుల అసిస్టెంట్ కమిషనర్-2 గుడివాడ రంగమణి, ఎంపీడీవో అరుణకుమారి, ఏవో జెన్నీ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: వ్యవసాయ యంత్ర పరికరాలపై ప్రభుత్వం జీఎస్టీను 5 శాతం తగ్గించిందని మండల వ్యవసాయ అధికారిణి కె.హెబ్సీబారాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి ఎన్.రమేష్, వెటర్నరీ డాక్టర్ నందకిషోర్, ఎంపీపీ రావి దుర్గావాణి, జీఎస్టీ ఆఫీసర్ సర్దార్ పాషా, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు యశ్వంత్, బాలాజీ, సుదర్శన్, అశోక్, పాల్గొన్నారు.

ఘంటసాల: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు చేకూరుతుందని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల అన్నారు. దేవరకోటలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస చంద్, ఇన్‌చార్జి ఏవో డి.అనూషా, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరిరావు, వీఏఏలు స్వామి, అహ్మద్, పావని, తేజ, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: మల్లవోలులో నిర్వహించిన జీఎస్టీ తగ్గింపు కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ అధికారి డాక్టర్ భూపాల్‌రెడ్డి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు, మండల వ్యవసాయ అధికారి జి.శివరామకృష్ణ, పశుసంవర్ధక అధికారి ఈ.వెంకట్రావు పాల్గొన్నారు.

వృద్ధులు సమాజ నిర్మాణ కారకులు

జాయింట్ కలెక్టర్ నవీన్



వయోవృద్ధులను సన్మానిస్తున్న జేసీ ఎం.నవీన్

చిలకలపూడి(మచిలీపట్నం): వృద్ధుల అనుభవం, జ్ఞానం, సలహాలు సమాజ నిర్మాణానికి విలువైనవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వృద్ధులను, వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో బి.శ్రీదేవి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరరావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ కల్పన, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, సాయిబాబు, డీపీవో జె.అరుణ పాల్గొన్నారు.

ముగిసిన తాళం భజన, మురళీ కోలాటం పోటీలు



కపిలేశ్వరపురం శ్రీకనకదుర్గ మహిళా సమాజం కోలాటం ప్రదర్శన

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పులోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్న తాళం భజన, మురళీ కోలాటం పోటీలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి 36 తాళం భజన బృందాలు, 11 మురళీ కోలాటం బృందాలు పాల్గొనగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు ఉత్సాహంగా సాగాయని తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 6న బహుమతులు అందించనున్నట్లు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మీ, దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వేంకటేశ్వరరావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, వేములపల్లి వెంకట్రావు, శీలి సముద్రాలు, పాగోలు కుమారి, వేమూరి రత్నగిరి, దోనేపూడి బుజ్జి, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గొర్రెపాటి రామకృష్ణ, పరిశే చలపతి, తదితరులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జిని వాడుకలోకి తీసుకురావాలి

ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని చిలకలపూడి రోడ్డులో నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జిని వాడుకలోకి తీసుకురావాలని ప్రజా ప్రతినిధులు, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం వే బ్రిడ్జిని పరిశీలించిన పలువురు మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సివిల్ సప్లయ్ వారి నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన వే బ్రిడ్జి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయిన పూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ చైర్పర్సన్ బండి పరాత్పరరావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామకం

మచిలీపట్నం టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మచిలీపట్నం నియోజకవర్గ నూతన కమిటీని బుధవారం నియమించినట్లు ఆ సంఘం కృష్ణా జిల్లా ఇన్‌చార్జి జలదంకి నరసింహారావు మాదిగ తెలిపారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీని నియమించామని తెలిపారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



మచిలీపట్నం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 7వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్‌ను మచిలీపట్నంలోని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. విద్యారంగంలో ఉపాధ్యాయుల కృషికి తగిన గుర్తింపు దక్కేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా చలో విజయవాడ చారిత్రక మలుపు కావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సభ్యులు ఎం.బాబు రాజేంద్రప్రసాద్, నాయకులు వి.సాంబశివరావు, బి.కనకారావు, హుస్సేన్, ఇమ్మానుయేల్, లంకేష్ పాల్గొన్నారు.

రైలు ప్రయాణీకుల సమస్యలను పరిష్కరించాలి



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రైల్వేస్టేషన్ ప్రయాణీకుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు నగరంలోని పార్లమెంట్ సభ్యుని కార్యాలయంలో ఎంపీ బాలశౌరికి ఆయన బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో తిరుపతి-మచిలీపట్నం సర్వీసు రోజూ నడిపేవారని, దానిని ప్రస్తుతం నిలిపివేశారని అన్నారు. దీని వల్ల ప్రయాణీకులు గుడివాడ నుంచి తిరుపతికి వెళ్లాల్సి వస్తోందన్నారు. స్టేషన్‌లో పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సంఘ నాయకులు ఏవీఆర్ రాజు, జన్ను గోవిందు, ఎన్.రాధాకృష్ణ, జోగి శివ పాల్గొన్నారు.

కార్తికేయుని సేవలో పశుసంవర్ధక శాఖ జె.డి.



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.భూపాల్ రెడ్డి, జిల్లా సంయుక్త సంచాలకులు(డీఏహెచ్‌వో) డాక్టర్ ఎం.చిన్న నరసింహులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, ఫణికుమార్‌శర్మ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. మండల పశుసంవర్ధకశాఖ డాక్టర్ నందకిషోర్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కోర్సులపై అవగాహన పెంచుకోవాలి



మచిలీపట్నం టౌన్: విద్యార్థినులు చదువుతో పాటు పలు ఉపాధి కోర్సులపై అవగాహన పెంచుకుని స్వయం ఉపాధి పొందే దిశగా పయనించాలని జిల్లా జీసీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. కోర్సులో శిక్షణ పొందిన 10 మంది విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు ఆమె అందజేశారు. ఒకేషనల్ కోర్సు ట్రైనర్ పరిమి రమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీరమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా

అవనిగడ్డ: ఇటీవల పలువురు డయేరియా బారిన పడినందున స్థానిక 8వ వార్డులో వాటర్ ట్యాంకుల ద్వారా బుధవారం మంచినీటి సరఫరా చేశారు. సర్పంచ్ గోరుముచ్చు ఉమ, ఈవో శ్రీనివాసరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.